

వాటా ఇచ్చుకో..వనరులు దోచుకో!

అధికారం అండతో తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోతున్నారు. కనిగిరిలో జోరుగా ఇసుక అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారు. ఇసుక స్టాక్ డిపో నిర్వాహకుడిది ఇష్టారాజ్యంగా మారిపోయింది.

- 8లో..



నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయాలి

నల్లబర్లీ పొగాకును పూర్తిగా కొనుగోలు చేయాలని నాగులుప్పలపాడులో ఆదివారం రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతులు నిరసన వ్యక్తం చేశారు.


- 8లో..

గరిష్టం/కనిష్టం
37 /27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల చిరుజల్లులు పడవచ్చు.

పేదలకు రెట్టింపు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని గత ఎన్నికల ముందు ఊదరగొట్టిన కూటమి నేతలు.. గద్దెనెక్కిన తర్వాత ఆ హామీని గాలికొదిలేశారు. 19 నుంచి 59 ఏళ్లలోపు వయసున్న ప్రతి మహిళకు రూ.1500 అందజేస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్న హామీని అమలు చేయాంటే ఆంధ్రాను అమ్మేయాలని మంత్రి అచ్చెంనాయుడు ఇటీవల బహిరంగంగానే వ్యాఖ్యానించడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధిని తేటతెల్లం చేసింది. మహిళలకు నెలకు రూ.1500 ఇవ్వకుండా ఎగ్గొట్టేందుకు పేదరిక నిర్మూలన పేరుతో పీ4ను తెరపైకి తెచ్చింది. పేద కుటుంబాలు, వారికి సాయం చేసే మార్గదర్శకులను ఎంపిక చేసే బాధ్యత ఉద్యోగులపై నెట్టింది. మార్గదర్శకులుగా ఉండేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు రాకపోవడంతో ఉద్యోగులే దత్తత తీసుకోవాలంటూ తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేస్తుండటంతో వారు మల్లగుల్లాలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు, సమస్యలు పరిష్కరించకపోగా అదనపు బాధ్యతలను తమపై రుద్దుతోందని ఉద్యోగులు మండిపడుతున్నారు.



ప్రచార ఆర్భాటమే..

బంగారు కుటుంబాలతో చిన్న వ్యాపారాన్ని ఏర్పాటు చేయించడం, ఉన్న వ్యాపారాన్ని విస్తరించడం, వ్యాపార అభివృద్ధి ఆలోచనలు, అప్‌గ్రేడ్ చేసేందుకు రుణాలు పొందేలా సలహాలు ఇవ్వాలి. కంప్యూటర్, మార్కెటింగ్ తదితర నిర్దిష్ట రంగాల్లో నైపుణ్యాన్ని వారికి కల్పించాలి. చదువుకున్న విద్యతో పాటు అదనపు విద్యను అందించడం తోపాటు స్కాలర్‌షిప్ పొందేలా వారికి మార్గనిర్దేశం చేయాల్సి ఉంది. అయితే ఇప్పటికే దత్తత తీసుకున్న కుటుంబాలకు ప్రభుత్వపరంగా ఒరిగిందేమీ లేదని.. కేవలం ప్రచార ఆర్భాటమే తప్ప ఎటువంటి ఉపయోగంలేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

హెచ్‌ఎంల సంఘ జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఎం.సుధాకర్



వై.వెంకటరావు

ఒంగోలు సిటీ: ఏపీ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నిక ఆదివారం ఒంగోలులోని ప్రధానోపాధ్యాయుల భవనంలో నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డేనియల్ పరిశీలకునిగా వ్యవహరించారు. జిల్లా గౌరవ అధ్యక్షునిగా ఎస్‌కే అహ్మద్ (జెడ్పీహెచ్‌ఎస్, ఏనుగులదిన్నెపాడు), అధ్యక్షునిగా ఎం.సుధాకర్ (జెడ్పీహెచ్‌ఎస్, తర్లుపాడు), ప్రధాన కార్యదర్శిగా వై.వెంకటరావు (జెడ్పీహెచ్‌ఎస్, త్రోవగుంట), కోశాధికారిగా జీఎస్‌ఆర్ సాయి (జెడ్పీహెచ్‌ఎస్, పల్లామల్లి), రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎం.శ్రీనివాసరావు (జెడ్పీహెచ్‌ఎస్, బిట్రగుంట), ఎస్‌కే ఖాదర్‌మస్తాన్ (జెడ్పీహెచ్‌ఎస్ గరల్స్, దర్శి), ఎం.విజయభాస్కర్‌రెడ్డి (జెడ్పీహెచ్‌ఎస్, అర్థవీడు), కార్యనిర్వాహక కార్యదర్శిగా పీ.మహబూబ్ ఖాన్ (జెడ్పీహెచ్‌ఎస్, పెద్దకండ్లగుంట), కేంద్ర కార్యదర్శిగా పీ.సుధాకర్ (జెడ్పీహెచ్‌ఎస్, జరుగుమల్లి)లను ఎన్నుకున్నారు. మార్కాపురం డివిజన్ అధ్యక్షునిగా టీ శ్రీనివాసులరెడ్డి (జెడ్పీహెచ్‌ఎస్, తాటిచర్లమోటు), కార్యదర్శిగా ఎస్.నాగేశ్వర రావు (జెడ్పీహెచ్‌ఎస్,మర్రిపాలెం), ఒంగోలు డివిజన్ అధ్యక్షునిగా కేసీహెచ్ సుబ్బారావు, కార్యదర్శిగా ఎస్‌వీ రాంబాబులను ఎన్నుకున్నారు.

ఉద్యోగులపై పీ4 పిడుగు

జిల్లాలో గుర్తించిన బంగారు కుటుంబాలు
68,961

బంగారు కుటుంబ సభ్యులు
1,89,944

గుర్తించిన మార్గదర్శకులు
7,786

- కింది స్థాయి ఉద్యోగులకు గుదిబండగా పీ4
- పీ 4 అమలుపై మల్లగుల్లాలు పడుతున్న సిబ్బంది
- స్వచ్ఛందంగా ముందుకురాని దాతలు
- సచివాలయ సిబ్బందికి కూడా తప్పని దత్తత
- జిల్లాలో 68,961 బంగారు కుటుంబాలు గుర్తింపు
- అందులో బలవంతంగా 50,752 కుటుంబాలు దత్తత
- మిగిలిన 18,209 కుటుంబాలు దాతల కోసం ఎదురుచూపులు
- ప్రభుత్వ ఆర్భాటంతో ఇబ్బందులు పడుతున్న సిబ్బంది
- దత్తత వల్ల ఒరిగేదేమీ లేదంటున్న ప్రజలు

నియోజకవర్గాల వారీగా బంగారు కుటుంబాల వివరాలు

నియోజకవర్గం	బంగారు కుటుంబాలు	కుటుంబ సభ్యులు	దత్తత తీసుకున్నవి	దత్తత తీసుకోవాల్సినవి	గుర్తించిన మార్గదర్శకులు
ఒంగోలు	9,618	25,577	8,177	1,441	1,362
మార్కాపురం	7,308	21,278	3,764	3,544	803
దర్శి	6,846	19490	3,433	3,413	597
గిద్దలూరు	9,870	27,817	6,857	3,103	735
కనిగిరి	7,823	21,643	6,350	1,473	1,424
కొండపి	10,697	28,412	7,845	2,852	940
ఎస్‌ఎన్‌పాడు	7,623	20,135	5,287	2,336	1,049
వైపాలెం	9,176	25,592	9,039	137	876

మార్కాపురం టౌన్:

కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు ఉద్యోగులకు గుదిబండగా మారాయి. పేదరికాన్ని నిర్మూలిస్తామంటూ పీ4 పేరుతో చేస్తున్న ఆర్భాటంతో ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. సచివాలయ సిబ్బందితో పీ4 సర్వే నిర్వహించి పేదరికంలో ఉన్న కుటుంబాల సంఖ్య, కుటుంబంలోని సభ్యుల సంఖ్య డేటాను సేకరించింది. జిల్లాలో 8 నియోజకవర్గాల్లో 'బంగారు కుటుంబం' కింద గుర్తించిన కుటుంబాలు 68,961 ఉండగా, 1,89,944 కుటుంబ సభ్యులు ఉన్నారు. 50,752 బంగారు కుటుంబాలను దత్తత తీసుకోగా, 18,209 కుటుంబాలను దత్తత తీసుకోవాల్సి ఉంది. వీరికి గానూ 7,786 మంది మార్గదర్శులను గుర్తించారు. దాతలు, ఉన్నతాధికారులు పేదరికంలో ఉన్న కుటుంబాలను దత్తత తీసుకుని వారికి అవసరమైన ఆర్థిక, మౌలిక వసతులు, విద్య, ఉపాధి తదితర అవకాశాలను ఎప్పటికప్పుడు వారికి తెలియచేస్తూ కుటుంబంలోని సభ్యులు వినియోగించుకుని ఆర్థికంగా ఎదిగేలా చేయాలన్నది ఈ పథకం ఉద్దేశం. అయితే క్షేత్ర స్థాయిలో అది కనిపించడం లేదని, అధికారులు, ప్రజలు చెబుతున్నారు. అధికారులు తీవ్ర వ్యయప్రయాలు పడి మార్గదర్శులను గుర్తించేందుకు ఒత్తిడికి గురవుతున్నారు. ఇందులో స్వచ్ఛందంగా మార్గదర్శులుగా ఉండేందుకు నమోదు చేసుకుంటున్న వారిసంఖ్య నామమాత్రంగా ఉంది. అధికారులు కొంతమందిని బలవంతంగా మార్గ దర్శకులుగా ఎంపిక చేశారన్న విమర్శలున్నాయి.

ఒత్తిడి భరించలేం బాబోయ్..

పీ4లో గుర్తించిన బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు దాతలు ముందుకు రాకపోవడం, పై స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడంతో కార్యాలయ సిబ్బంది, సచివాలయం ఉద్యోగులపై ఉన్నతాధికారులు తీవ్రఒత్తిడి తెస్తున్నారు. తమ ఉద్యోగంతోపాటు బంగారు కుటుంబ సభ్యులకు అవగాహన, అభివృద్ధి పరిచేందుకు సమయం ఎక్కడుందని వారు వాపోతున్నారు. ఒక్కో అధికారి ఒక బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని, కింద స్థాయి ఉద్యోగులపై ఉన్నతాధికారులు బలవంతం చేస్తున్నారు. బంగారు కుటుంబ సభ్యుల సంఖ్యకు అనుగుణంగా మార్గదర్శకులను ఎంపికపూర్తి చేయాలని, లక్ష్యాలను నిర్దేశించి వారిపై ఒత్తిడి తెస్తున్నారని తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు సంబంధించిన ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదు. ఐఆర్, పెండింగ్ డీఏలు, పీఆర్‌సీ అమలు వంటి వాటి ఊసేలేదు. తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించకపోగా అదనపు బాధ్యతలతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని ఉద్యోగులు మండిపడుతున్నారు.

బంగారు కుటుంబం అర్హతలు

కూటమి ప్రభుత్వం పీ4 సర్వేలో బంగారు కుటుంబానికి అర్హత కలిగిన వారిని గుర్తించేందుకు మార్గదర్శకాలను రూపొందించింది. ఇందులో భాగంగా ఎల్‌పీజీ లేని కుటుంబం, సాంప్రదాయ ఇంధనాన్ని వాడుతుండాలి. ఇంటికి విద్యుత్ సౌకర్యం లేని కుటుంబం, ఆదాయం లేని కుటుంబం, ఉద్యోగం, అద్దె, వడ్డీ, పెన్షన్ తీసుకోని కుటుంబం, తాగునీరు అందుబాటులో లేని కుటుంబం, తాగునీరు తెచ్చుకునేందుకు 30 నిమిషాలు సమయం పట్టే కుటుంబాలు, బ్యాంకు ఖాతాలు లేని వారు అర్హులు.

'పేదల పార్టీ'ని రాజకీయ పార్టీల జాబితా నుంచి తొలగింపు

ఒంగోలు సబర్బన్: 'పేదల పార్టీ' అనే రాజకీయ పార్టీని రిజిస్టర్డ్ పార్టీల జాబితా నుంచి తొలగించాలని ప్రతిపాదిస్తూ రాష్ట్ర ఎన్నికల అధికారి ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు ఆమె ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో రాజకీయ పార్టీలు ఉనికిలో లేవని తెలుపుతూ పొదిలి మండలం కాటూరివారిపాలెం గ్రామానికి చెందిన 'పేదల పార్టీ' 2019 నుంచి ఒక్క ఎన్నికల్లో కూడా పోటీ చేయనందుకుగాను సదరు పార్టీ అధ్యక్షుడు / ప్రధాన కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. దీనిపై ఈనెల 28వ తేదీ నాటికి సంబంధిత పత్రాలతో లిఖిత పూర్వకంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి తెలియజేయాలన్నారు. ఈ విషయమై పార్టీ వ్యక్తిగత విచారణకు ప్రధాన ఎన్నికల అధికారి వద్ద వచ్చే నెల 8వ తేదీ హాజరుకావాలని ఆదేశించారు.

న్యూస్‌రీల్

సీబీఎస్‌సీ సౌత్ జోన్ తైక్వాండో విజేతలకు బహుమతులు




గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న స్వరూప్‌రంజన్, టోర్నమెంట్ నిర్వాహకులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని కమలా హైస్కూల్‌లో మూడు రోజులుగా జరుగుతున్న సీబీఎస్‌సీ స్కూల్స్ సౌత్‌జోన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీలకు ఏపీ, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి, అండమాన్ తదితర ప్రాంతాల నుంచి సుమారు 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అండర్ 14, 17, 19 విభాగాల్లో విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బంగారు, వెండి, కాంస్య పతకాలను టోర్నమెంటు అబ్జర్వర్ సీ దొరై, హైస్కూల్ ప్రిన్సిపల్ స్వరూప్ రంజన్ అందజేశారు.

ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.వి.కొండారెడ్డి



దారా రూతమ్మ

ఒంగోలు సిటీ: ఆర్పీలకు నష్టం కలిగించే ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఏపీ మెప్మా ఆర్పీ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) జిల్లా ద్వితీయ మహాసభ బీ విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.వి కొండారెడ్డి మాట్లాడారు. అనంతరం ఈ సభలో ఒంగోలు, చీమకుర్తి, కనిగిరి, గిద్దలూరు, మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలో పనిచేసే ఆర్పీలందరూ పాల్గొని నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా దారా రూతమ్మ, గౌరవ అధ్యక్షురాలిగా కల్పన, ప్రధాన కార్యదర్శిగా నారాయణస్వామి రాజ్యలక్ష్మి, కోశాధికారిగా పమిడి పద్మశ్రీ,, సహాయ కార్యదర్శిగా జమ్ములమడుగు సుజాత, నయోమి, ఉపాధ్యక్షులుగా పీ ఆదిలక్ష్మిని పాలకవర్గంగా ఎన్నుకున్నారు. 11 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నార ని చెప్పారు. ఈ సందర్భంగా వేతనాలు పెంచాలని, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని, పని భారాన్ని తగ్గించాలని కోరారు. ఆన్‌లైన్ యాప్స్ శిక్షణ ఇవ్వాలని, రూ.10 లక్షలు గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలన్నారు. కార్యక్రమంలో సాయి లక్ష్మి, రేణుక, రమణ, దివ్య శాంతి, శ్రీ లక్ష్మి, చంద్రిక, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలన మోసాలమయం

- ఎన్నికల ముందు మోసపు హామీలు
- గెలిచాక మోసగించడం చంద్రబాబు నైజం
- రాష్ట్రంలో పెరిగిన దాడులు, అఘాయిత్యాలు
- బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమంలో మాజీ మంత్రి మేరుగు నాగార్జున



నాగులుప్పలపాడులో బాబు మోసాలపై క్యూఆర్ కోడ్ విడుదల చేస్తున్న మేరుగు నాగార్జున, నాయకులు



పి.గుడిపాడులో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీలో మాట్లాడుతున్న మేరుగు నాగార్జున

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్)/నాగులుప్పలపాడు: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రాష్ట్రంలో పరిపాలన స్తంభించిపోయిందని, ఎక్కడ చూసినా మోసాలమయమైందని సంతనూతలపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. సంతనూతలపాడు మండలంలోని పి.గుడిపాడు, కొనగానివారిపాలెం గ్రామాల్లో, నాగులుప్పలపాడు మండలం ఓబన్నపాలెం, నాగులుప్పలపాడు గ్రామాల్లో ఆదివారం బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. సంతనూతలపాడులో మండల పార్టీ అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి అధ్యక్షతన వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేరుగు నాగార్జున మాట్లాడుతూ ఎన్నికల ముందు మొసలి కన్నీరు కార్చి అధికారంలోకి వచ్చిన తరువాత వెన్నుపోటు పొడవటం చంద్రబాబుకు అలవాటే అన్నారు. ఎప్పుడు ఎన్నికల్లో పోటీచేసినా ఏదో ఒక పార్టీ మద్దతుతో కల్లబొల్లి మాటలు చెప్పడం.. గెలిచిన తరువాత ప్రజల్ని మర్చిపోవడం ఆయన నైజమన్నారు. సూపర్‌సిక్స్ పేరుతో ఇంటింటికీ తిరిగి కూటమి నాయకుల ఫొటోలు వేసుకుని బాండ్లు పంపిణీ చేశారని, ఆ బాండ్లలో ఉన్న అంశాలను ఎవరైనా ప్రశ్నిస్తే ప్రశ్నించిన వారిపై అరెస్టులు, అసత్య ప్రచారాలు, కేసులుపెట్టి భయభ్రాంతులకు గురి చేయడం సర్వసాధారణమైందని విమర్శించారు. అన్నదాతకు ఎరువులు కొరత, పండించిన పంటకు మద్దతు ధర లేదన్నారు. ప్రతి పనికి దోచుకోవడం, దాచుకోవడం అన్నట్లు పనులు చేస్తున్న టీడీపీ నాయకులు అవినీతి కూపంలో కూరుకుపోయారని విమర్శించారు. పొగాకు రైతులను, మిర్చి రైతులను చంద్రబాబు చేసిన మోసం వారు జీవితంలో మరచిపోరన్నారు. బర్లీ పొగాకు కొనుగోళ్లలో పార్టీలు చూసి కొనుగోలు చేస్తున్న ఈ ప్రభుత్వం, జగన్‌మోహన్ రెడ్డి పాలన ఎలా చేశాడో చూసి సిగ్గు తెచ్చుకోవాలన్నారు. కూటమి దౌర్జన్య పాలనకు చరమగీతం పాడాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ ను సీఎం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ ను నాగార్జున, నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ బీ విజయ, మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, దుంపా ఎలమందరెడ్డి, సర్పంచ్ కుంచాల పుష్ప సుబ్బారావు, సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి, నాగులుప్పలపాడు మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మారెళ్ల బంగారుబాబు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొలడుగు రాజీవ్, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు పోలినేని కోటేశ్వరరావు, దివ్యాంగుల విభాగం రాష్ట్ర కార్యదర్శి కాట్రగడ్డ శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు తానిపర్తి శేషురెడ్డి, గొడుగు కాలేషా, మహిళా విభాగం అధ్యక్షురాలు సీతమ్మ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన ఒంగోలు పుస్తక మహోత్సవం

- పుస్తక మహోత్సవానికి విశేష స్పందన



పుస్తక మహోత్సవంలో మాట్లాడుతున్న సాహితీవేత్తలు

ఒంగోలు సిటీ: పది రోజుల పాటు పుస్తక ప్రియులను అలరించిన మూడో ఒంగోలు పుస్తక మహోత్సవం ఆదివారం ఘనంగా ముగిసింది. చివరి రోజు కావడంతో పాఠకులు ఉదయం 10 గంటల నుంచే పీవీఆర్ బాలుర పాఠశాల మైదానానికి పోటెత్తారు. రాత్రి 9 గంటల వరకు పుస్తకాల కొనుగోలు కొనసాగింది. వచ్చే ఏడాది ఒంగోలుకు మళ్లీ వస్తామని నిర్వాహకులు ఇచ్చిన హామీతో పుస్తక మహోత్సవానికి వీడ్కోలు పలికారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు నిర్వహించిన క్విజ్ పోటీలో మొత్తం 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీకి చెందిన రహ్మానుద్దీన్ నిర్వహించారు. క్విజ్ పోటీలో మూడు జట్లు బహుమతులు సాధించాయి. పది రోజుల పాటు జరిగిన పుస్తక మహోత్సవంలో కథలు చెప్పడం, చిత్రలేఖనం, దేశభక్తి గీతాలాపన, ఏకపాత్రాభినయం, క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన మొత్తం 60 మంది విద్యార్థులకు ముఖ్య అతిథి పెనుగొండ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. దివంగత బి.హనుమారెడ్డి జీవితం–సాహిత్యం అంశంపై చర్చా వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాశ్, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు కె.లక్ష్మయ్య తదితరులు వక్తలుగా పాల్గొన్నారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. మూడో ఒంగోలు పుస్తక మహోత్సవం ముగింపు సభ సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైంది. ఈ సభకు జనవిజ్ఞాన వేదిక సీనియర్ నాయకుడు పుల్లారావు అధ్యక్షత వహించారు. ముగింపు ప్రసంగాన్ని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక అధ్యక్షుడు వల్లూరు శివప్రసాద్ అందించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదికకు చెందిన జయప్రకాశ్, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు కె.లక్ష్మయ్య, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ తరపున సాహిత్య కార్యక్రమాల నిర్వాహకులు రహ్మానుద్దీన్ పాల్గొన్నారు. ముగింపు సభలో లక్ష్మయ్య మాట్లాడుతూ ఒంగోలు పుస్తక మహోత్సవం ఒంగోలుకు చెందిన సాహితీవేత్తలు తమంతట తాముగా నిర్వహించదలిస్తే అందుకు పూర్తి సహకారం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అందిస్తుందని ఆయన అన్నారు.

రాజకీయ ప్రత్యామ్నాయం రూపొందించుకోవాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- ఒంగోలులో ఘనంగా సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలు



ప్రతినిధుల సభలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు, మాదాల రవి తదితరులు

ఒంగోలు సిటీ: రాష్ట్రంలో మతోన్మాద అరాచక పాలనకు ప్రత్యామ్నాయంగా వామపక్ష పార్టీలు రాజకీయ ప్రత్యామ్నాయం రూపొందించుకోవాలని, ఆ దిశగా చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు అన్నారు. వామపక్ష ఉద్యమాల బలోపేతానికి తాము కృషి చేస్తామన్నారు. ఒంగోలులో సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలు ఎస్‌జీవీఎస్ కళ్యాణ మండపం ఆవరణలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వామపక్ష పార్టీలు బలపడితేనే మతోన్మాదాన్ని ఎదిరించగలమని, ఆ దిశగా కమ్యూనిస్టు పార్టీ 28వ రాష్ట్ర మహాసభల్లో కార్యాచరణ రూపొందించుకోవాలని ఆయన సూచించారు. ఓట్లు చేర్పుల విషయంలో బీహార్‌లో ఎస్ఐఆర్ అమలు చేస్తూ అత్యంత కుట్రపూరితంగా ఎన్నికల కమిషనర్ వ్యవహరిస్తోందన్నారు. మరోవైపు వామపక్ష పార్టీల అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో 30 రోజుల జైలు జీవితం ఉంటే ఉద్వాసన పలకాలన్న చట్టాన్ని ప్రతిపాదించడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో మతోన్మాదం ఎప్పుడూ లేనంతగా పెరిగిందని, మోదీ భజనలు చంద్రబాబు ఎత్తుకుని మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ప్రశ్నించడానికి పుట్టిందన్న జనసేన, 32 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వాదించిన పవన్ కళ్యాణ్ అధికారంలోకి వచ్చిన తర్వాత నోరు మెదపకపోవటం దారుణమన్నారు. పరిశ్రమలు, రాజధాని అభివృద్ధి పేరుతో లక్షలాది ఎకరాలు సేకరించి రియల్ ఎస్టేట్‌గా అభివృద్ధి చేస్తున్నారని, ఆ భూములు తనఖా పెట్టి బ్యాంకుల్లో రుణాలు తీసుకుని రాష్ట్రాన్ని దివాలా తీయిస్తున్న కార్పొరేట్ శక్తుల అభివృద్ధికి చంద్రబాబు నాయుడు దోహదపడుతున్నారని తీవ్రంగా ఆరోపించారు. 28వ రాష్ట్ర మహాసభలకు సూచనగా వేదిక నల్లూరి అంజయ్య ప్రాంగణంలో మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖర రావు మృతవీరుల స్థూపాన్ని ఆవిష్కరించారు. పార్టీ జాతీయ నాయకులు రావుల వెంకయ్య ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభించారు. రాష్ట్ర నాయకుడు పీ జగదీష్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. మహాసభలకు రాష్ట్ర నాయకులు జీవీ సత్యనారాయణమూర్తి, దుర్గా భవాని, నాజర్, జీఎంఎల్ నారాయణ అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన సభలో సీపీఐ జాతీయ కమిటీ నాయకురాలు వహీదా పర్వీన్, సీపీఐ జాతీయ కమిటీ నాయకుడు రావుల వెంకయ్య, సినీ నటుడు మాదాల రవి, జీ ఈశ్వరయ్య, రావుల రవీంద్రనాథ్, నల్లూరి వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు.

క్లుప్తంగా

అగ్నివీర్‌కు 159 మంది అర్హత



ఉత్తీర్ణత సాధించిన అకాడమి విద్యార్థులు

తిరుపతి రూరల్: అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ రాత పరీక్షలో ఎస్వీ డిఫెన్స్ అకాడమికి చెందిన 159 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు అకాడమి చైర్మన్ బీ శేషారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి ఉచితంగా ఫిజికల్ ట్రైనింగ్ ఇచ్చామని, వారు ఉద్యోగంలో చేరడానికి అవసరమైన సహకారం అందిస్తామన్నారు. అంతకుముందు 159 మంది విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

అండర్ 17 ఫెన్సింగ్ జిల్లా క్రీడాకారుల ఎంపిక



ఫెన్సింగ్ జిల్లా క్రీడాకారులు

ఒంగోలు: జిల్లా ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక ఆదివారం స్థానిక డాక్టర్ పర్వతరెడ్డి ఆనంద్ మినీ స్టేడియంలో నిర్వహించారు. ఎంపిక ప్రక్రియను ప్రకాశం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ చైర్మన్ కె.సాయి మనోహర, వ్యవస్థాపక అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు పర్యవేక్షించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 30న భీమవరం వెస్ట్ బెర్రీ పాఠశాలలో జరిగే అండర్ 17 క్యాడెట్ 11వ రాష్ట్రస్థాయి పోటీలలో ప్రకాశం జిల్లా తరుపున పాల్గొంటారని జిల్లా ఫెన్సింగ్ ముఖ్య కార్యదర్శి జి.నవీన్ తెలిపారు.

ఎంపికైన బాలురు..

పి.అంబరీష్, కె.జగదీష్, ఎండీ అబ్దుల్, ఎస్. సంతోష్(ఈపీ), కె.దరహాస్, ఎస్‌కే అదిల్, బి.ఈశ్వర్, ఎం.యతిన్ శ్రీకార్తికేయ(ఫాయిల్), ఈ.తనూజ్, పి.నిఖిల్, టి.అభినవ్ బుద్ధ, కె.తారక్‌రామ్(సాబ్రే)

ఎంపికైన బాలికలు:

ఎస్‌కె ఫిర్దోస్ తాన్‌వీర్, ఎం.మనస్వి(ఈపీ), పి.లిఖితరెడ్డి(ఫాయిల్), పి.చక్రిక, ఈ.మహిత, వి.లేఖన(సాబ్రే)

మహాధర్నాను జయప్రదం చేయండి

ఒంగోలు సిటీ:

2004కు ముందు నియామక ప్రక్రియ ప్రారంభించిన ఉపాధ్యాయులు, ఉద్యోగ, పోలీసులందరికీ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 25వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ అలంకార్ సెంటర్‌లో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డి వీరాంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. 2003 డీఎస్సీ టీచర్స్ ఫోరం చేపట్టిన మహా ధర్నాకు జిల్లా శాఖ సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందన్నారు. జిల్లాలోని యూటీఎఫ్ కార్యకర్తలు భారీ ఎత్తున మహా ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వాటా ఇచ్చుకో.. వనరులు దోచుకో..!

- కనిగిరిలో ఇసుకాసురులు
- అధికార అండతో జోరుగా అక్రమ తవ్వకాలు
- శివార్లలో డంపింగ్ పాయింట్లు
- కనిగిరిలో ఇసుక స్టాక్ డిపో నిర్వాహకుడి ఇష్టారాజ్యం
- టన్ను ఇసుకకు రూ.200 నుంచి రూ.300 అదనంగా వసూలు
- అడ్డుగోలు దోపిడీతో అల్లాడుతున్న గృహ నిర్మాణదారులు



కనిగిరిలో ఇసుక దంపింగ్ పాయింట్

కనిగిరిరూరల్/పీసీపల్లి: అధికార అండతో తెలుగు తమ్ముళ్లు పెట్రేగిపోతున్నారు. ఇసుక వ్యాపారాన్ని పూర్తిగా తమ చేతుల్లోకి తీసుకోని గుత్యాధిపత్యం ప్రదర్శిస్తూ దోచేస్తున్నారు. వారు నిర్ణయించిన ధరకే ఇక్కడ కొనుగోలు చేయాలి. లేదంటే తట్ట ఇసుక కూడా దొరకదు. బయట ప్రాంతాల నుంచి ఇసుక తీసుకువచ్చినా చెప్పిన ధరకే ఇచ్చేసి పోవాలి. లేదంటే వాహనం అక్కడ నుంచి కదలదు. ఇలా ఇసుక వ్యాపారాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారు.

అంతా అతని చేతుల్లోనే..

కనిగిరి నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన పీసీపల్లి మండల నేత ఇసుక స్టాక్ పాయింట్ కాంట్రాక్టర్‌ను దక్కించుకున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని అంతా నా ఇష్టం అన్నట్లు వ్యవహరిస్తూ ఇతరులు వ్యాపారం చేసుకోనివ్వకుండా, గంప ఇసుక అయినా తానే ఇవ్వాలంటూ వ్యవహరిస్తూ దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నాడు. ఇటీవల స్టాక్ పాయింట్ నిర్వాహకునితో ఇసుక లోకల్ వ్యాపారులు, ట్రాక్టర్, లారీ ఓనర్లు గొడవకు దిగినట్లు ప్రచారం జరుగుతోంది. డంపింగ్ పాయింట్ నిర్వాహకుడు అధికార పార్టీకి చెందిన వాడు కావడంతో అతనితో ఢీకొట్టలేక మౌనం దాల్చి లోలోన తీవ్ర అసంతృప్తితో రగులుతున్నారు. ఇక పీసీపల్లి మండలంలోని వాగుల్లో తెలుగు తమ్ముళ్లు జోరుగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. పాలేటి నది పరివాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు చేసి ట్రక్కు కట్టుబడి ఇసుక రూ.2,200 నుంచి రూ.2,500 వరకు అమ్మకాలు చేస్తున్నారు. తలాపాపం తిలా పిడికెడు అన్న చందంగా అధికారులు, అధికార పార్టీ నేతలు, అందరికీ వాటాలు ఉన్నట్లు ప్రచారం ఉంది.

టన్నుకు రూ.300 వరకు అదనపు దోపిడీ

కనిగిరి నియోజకవర్గానికి అత్యధికంగా నెల్లూరు, జలదంకి తదితర ప్రాంతాల నుంచి ఇసుక రవాణా అవుతోంది. లారీ లోడింగ్‌తో కలిపి ఇసుక టన్ను కనిగిరికి చేరే సరికి రూ.600 వరకు పడుతుంది. దీన్ని నేరుగా వినియోగదారునికి అందించినా బేల్దార్‌లకు ఇచ్చినా.. అవసరాన్ని బట్టి రూ 550 నుంచి రూ 600లకు దించుతారు. అయితే స్టాక్ పాయింట్ నిర్వాహకుడు అధికార అండతో అధికారులను అడ్డుపెట్టుకుని ఇసుక లారీల డ్రైవర్లను, యజమానులను బెదరించుకుని తన స్టాక్ పాయింట్‌కు తరలించుకుంటున్నాడు. తన పాయింట్‌లో డంప్ చేసిన ఇసుకను, లేదా తన ద్వార సరఫరా చేసే..ఇసుక లారీ లోడును టన్ను రూ.800 నుంచి రూ.850లకు విక్రయిస్తున్నాడు. లారీ సుమారు 35 నుంచి 40 టన్నులు ఉంటుంది. అంటే ప్రతి టన్నుకు ఖర్చులు పోను సరాసరిన రూ.200 మిగిలినా ఒక లారీకి దాదాపు రూ.6 నుంచి రూ.8 వేల వరకు ఆదాయం మిగులుతుంది. ట్రాక్టర్ లెక్కన అయితే ట్రక్కు రూ.3,800లకు విక్రయిస్తున్నాడు. ఇందులో కూలీలు రూ.300, ట్రాక్టర్ బాడుగ రూ.500 ఖర్చవుతుంది. స్టాక్ పాయింట్ నిర్వాహకుడు అధికార పార్టీ నేత కావడంతో బయట నుంచి వచ్చే(చీమకుర్తి, సంతనూతపాడు, మార్కాపురం) ఇసుక లారీలు సైతం అతనికే లోడును దింపి వెళ్లాల్సిన పరిస్థితి. ప్రతి రోజు కనీసం 3నుంచి 5 లారీల ఇసుక అమ్మకం జరుగుతున్నట్లు ఇసుక వ్యాపారులు చెప్తున్నారు.

జోరుగా ఇసుక అక్రమ తవ్వకాలు



పెద్ద అలవలపాడు రవాణాకు సిద్ధంగా ఉన్న ఇసుక డంపింగ్

పీసీపల్లిలో ఇసుక అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. అధికార పార్టీ నేతలు ఇష్టారాజ్యంగా ఇసుక దోపిడీ వ్యాపారం చేస్తున్నారు. అధికారం మాది, అంతా మాది అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇసుకాసురులు అధికార పార్టీకి చెందిన వారు కావడం అక్రమార్జనలో ఎవరి వాటా వారికి దక్కుతుండటంతో రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు సైతం ఎవరికి వారు మౌనం దాల్చుతున్నారు. మండలంలో పాలేరు నది పరివాహక ప్రాంతాల్లో జోరుగా ఇసుక తవ్వాకాలు చేస్తున్నారు. టీడీపీ మండల, గ్రామ స్థాయి నేతలు ప్రొక్‌లైన్ పెట్టి మరీ తవ్వకాలు చేసి గ్రామ శివార్లలో ఇసుక డంపింగ్ పాయింట్లు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. మండలంలోని పెద అలవలపాడు, నేరేడుపల్లి, బట్టుపల్లి, గంగ దగ్గర, పాటిటిల్లి, పంచలింగాల కొండ వాగుల సమీపంలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. సంపద సృష్టిలో భాగంగా టీడీపీ గ్రామ స్థాయి నేతలు జోరుగా ఇసుక దందా చేస్తూ రూ.లక్షలు అక్రమార్జన చేస్తున్నారు.

ఎరువుల దుకాణంపై విజిలెన్స్ దాడులు



ఎరువులు తనిఖీలు చేస్తున్న అధికారులు

దర్శి: మండలంలోని రాజంపల్లి గ్రామంలో ఎరువుల దుకాణంపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. సీఐ రాఘవరావుల ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో విజిలెన్స్ ఏఓ శివనాగప్రసాద్, ఏఓ రాధలు కలసి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 5.76 మెట్రిక్ టన్నుల యూరియా షార్టేజ్ ఉన్నట్లు గుర్తించారు. ఎటువంటి లైసెన్స్ లేకుండానే విత్తనాలు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ అక్రమాల పై దుకాణం నిర్వాహకుడు మురళిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



చికిత్స పొందుతున్న చిన్నపోలు (ఫైల్)

కొండపి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..గురువారం సాయంత్రం మండలంలోని ముప్పవరం గ్రామంలో కారు, బైక్ ఢీకొన్నాయి.ఆ సంఘటనలో గాయపడిన పెరిదేపి గ్రామానికి చెందిన అంగలకుర్తి చిన్న పొలు(55)ను చికిత్స నిమిత్తం ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న చిన్న పొలు ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొండపి ఎస్సై ప్రేమ్ కుమార్ తెలిపారు.

హామీలు విస్మరించడం చంద్రబాబు నైజం



మద్దిపాడులో క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, పాల్గొన్న నేతలు

మద్దిపాడు: ఎన్నికలకు ముందు అలివిమాలిన హామీలు ఇవ్వడం, అధికారంలోకి రాగానే విస్మరించడం చంద్రబాబుకు అలవాటుగా మారిందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున ధ్వజమెత్తారు. మండలంలోని మద్దిపాడు, బసవన్నపాలెం గ్రామాల్లో ఆదివారం బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల సమయంలో వందలాది హామీలిచ్చి ఒకటి అరా అరకొరగా హామీలు చేసి అన్ని హామీలు అమలు చేశామని గొప్పలు చెప్పుకోవడం దుర్మార్గమన్నారు. ప్రజలు నమ్మిన ప్రతిసారి వారిని నిలువునా మోసం చేయడం చంద్రబాబుకు అలవాటుగా మారిందన్నారు. ప్రజలకు మేలు చేయడం కంటే తన సొంత లాభం చూసుకోవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ప్రస్తుతం అమరావతి నిర్మాణాల పేరుతో చేపడుతున్న పనులు పనికి వచ్చేవేనా అంటూ ప్రశ్నించారు. నిలువెత్తు నీళ్లలో మునిగిన అమరావతిని ప్రజలు ప్రసార మాధ్యమాల ద్వారా చూసి ఇక్కడ అమరావతి నిర్మించడం ఏమిటని ప్రశ్నిస్తున్నా తాను పట్టిన కుందేలుకు మూడు కాళ్లే అని వాదించే రకం చంద్రబాబు అన్నారు. 14 నెలల కాలంలో లక్షల కోట్లు అప్పులు తీరి రాష్ట్రాన్ని దివాలా తీసే పరిస్థితులు తీసుకువస్తున్నారన్నారు. చంద్రబాబు ఏనాడైనా ప్రజలకు ఉపయోగపడే ఒక్క పథకం అయినా అమలు చేశారా అని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. నాయకులు, కార్యకర్తలు ఎవ్వరూ అధైర్యపడాల్సిన అవసరంలేదన్నారు. కూటమి నాయకులు మేనిఫెస్టోను గ్రామాల్లోకి తీసుకువెళ్లి మది మంచి ప్రభుత్వం అని చెప్పే దమ్ము ఉందా అంటూ సవాల్ విసిరారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో జరుగుతున్న మోసాలను ప్రజల్లోకి విస్తతంగా తీసుకు వెళ్లాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. అనంతరం మద్దిపాడు, బసవన్నపాలెం గ్రామాల్లో క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. అనంతరం గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. మద్దిపాడు గ్రామ పార్టీ అధ్యక్షునిగా కాకుమాను శశికుమార్‌ను ఎంపిక చేసి ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మండవ అప్పారావు ఉపాధ్యక్షుడు వాకా కోటిరెడ్డి, నాయకులు మోరబోయిన సంజీవరావు, మద్దా లక్ష్మీనారాయణ, నట్టే సంజీవరావు, కంకణాల సురేష్, నాదెండ్ల మహేష్, సన్నపు రెడ్డి రమణమ్మ, చిన్న అప్పయ్య, శ్రీరామమూర్తి, అబ్దుల్ మజీద్ పైనం ప్రభాకర్, పోకూరి శ్రీరామ మూర్తి పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీనియర్ అంతర్‌జిల్లాల మహిళా జట్టు ఎంపిక



జిల్లా సాఫ్ట్‌బాల్ మహిళా సీనియర్ జట్టు

ఒంగోలు: ప్రకాశం జిల్లా సాఫ్ట్‌బాల్ సీనియర్ మహిళా జట్టు ఎంపిక ఆదివారం స్థానిక శ్రీహర్షిణీ కాలేజీ క్రీడా ప్రాంగణంలో జరిగింది. ఎంపిక ప్రక్రియను ప్రకాశం జిల్లా అడ్‌హక్ కమిటీ సభ్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులైన పి.నరసింహారెడ్డి, సంయుక్త కార్యదర్శి ఎ.రాంప్రసాద్ పర్యవేక్షించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీహర్షిణీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ దాది ఆంజనేయులు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించడం ద్వారా విద్య, ఉద్యోగ అవకాశాలను త్వరగా పొందవచ్చన్నారు. ఈనెల 30,31 తేదీల్లో గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో కూడా రాణించి జిల్లా కీర్తి ప్రతిష్టలు ఇనుమడింపజేయాలని కోరారు.

జిల్లా జట్టు.. సీహెచ్ మాధురి, జి.తేజస్విని, బి.భవాని, బి.భాగ్యశ్రీ, సీహెచ్ హర్ష ప్రియ, బి.కీర్తిన, ఎన్.ప్రణతి, బి.భావన, ఐ.నాగవేణి, చైత్ర, సుల్తానా గ్రేస్, హాసిని, ధరణి, చరితారెడ్డి, ఆమోస్.

సీసీపై చర్యలు తీసుకోవాలని వినతి



జిల్లా కార్యాలయం వద్ద గ్రామస్తులు, డ్వాక్రా మహిళలు

టంగుటూరు: గ్రామ సమైక్య సంఘంలో అక్రమాలకు పాల్పడిన సీసీపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. కందులూరు గ్రామంలోని కందులూరు-1 గ్రామ సమైక్య సంఘ సభ్యులు ఒంగోలులోని అధికారులను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ సమైక్య అధ్యక్షురాలు బొట్ల వెంకటరమణమ్మ, కార్యదర్శి ఉప్పలపాటి వెంకట్రావమ్మ, కోశాధికారి బొడ్డు సుశీల 25 గ్రామ సంఘాల సభ్యులు, మొదటి, రెండో లీడర్లతో ఎటువంటి సమావేశంగాని, సంప్రదింపులుగాని లేకుండా వెలుగు సీసీలు చెన్నుపాటి కవిత, అప్పిశెట్టి అరుణ కలిసి స్థానిక బ్యాంకు ఆఫ్ బరోడా బ్రాంచ్ మేనేజర్ జగదీశ్‌తో కలిసి ఫోర్జరీ సంతకాలతో తీర్మానం చేశారన్నారు. బ్యాంకులో వీరి పేర్లు మార్చి, చెక్ బుక్ రద్దుకి కూడా సిఫార్సు చేశారన్నారు. విషయం తెలుసుకున్న సభ్యులు ఫోర్జరీ చేసిన వారిపై విచారణ చేయాలని జేసీకి ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా పొరసరఫరాల సంస్థ డిప్యూటీ కలెక్టర్ విచారణ చేశారు. సరైన నివేదిక ఇచ్చి జేసీకి అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సమైక్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగాసనాల్లో సత్తా



ప్రశంసాపత్రం అందుకుంటున్న స్వర్ణ వెంకటరమణయ్య



యోగాసనాలు వేస్తున్న వెంకటరమణయ్య

పీసీపల్లి: రాష్ట్రస్థాయి యోగాసనాల్లో మండలంలోని వెంగలాయపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన స్వర్ణ వెంకటరమణయ్య సత్తా చాటారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో హ్యాండ్ బ్యాలెన్స్ ఆసనాల్లో ద్వితీయస్థానం, సుపైన్ ఆసనాల్లో తృతీయ స్థానం సాధించి జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. వెంకట రమణయ్యను మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు, సంజీవ్ ఆంధ్రప్రదేశ్ పతంజలి యోగ పీఠం అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, రాజకీయ నాయకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

నల్లబర్లీ పొగాకు పూర్తిగా కొనుగోలు చేయాలి

- రైతుసంఘం ఆధ్వర్యంలో రైతుల నిరసన



ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

నాగులుప్పలపాడు: నల్లబర్లీ పొగాకు పూర్తిగా కొనుగోలు చేయాలని రైతు సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. ఆదివారం నాగులుప్పలపాడు బస్టాండ్ సెంటరులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జే. జయంత్‌బాబు, పమిడి వెంకట్రావులు మాట్లాడుతూ.. ఈ ఏడాది ప్రైవేట్ కంపెనీలు రైతులను ప్రోత్సహిస్తూ ఎంత పొగాకు పంట సాగు చేసినా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చి రైతుల చేత బర్లీ పొగాకు వేయించారన్నారు. తీరా పంట చేతికి వచ్చిన తరువాత కంపెనీలు చేతులెత్తేయడంతో రైతాంగం దిక్కుతోచని పరిస్థితుల్లో పడింది. ఈనేపథ్యంలో రైతుల వద్ద బర్లీ పొగాకును పూర్తిగా కొనుగోలు చేయాలని పలు దఫాలు ఆందోళన కార్యక్రమం చేపట్టామన్నారు. దీంతో దిగివచ్చిన ప్రభుత్వం రైతుల వద్ద ఉన్న బర్లీ పొగాకు చివరి ఆకువరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చి రైతుల వివరాలను నమోదు చేయించింది. ఆమేరకు మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి గత రెండు నెలల నుంచి కొనుగోలు ప్రారంభించారు.

కూలీలకు డబ్బులు ఇవ్వలేని దుస్థితి..

ప్రస్తుతం గోదాములు ఖాళీగా ఖాళీగా లేవని సాకుతో కొనుగోలు నిలిపివేయడం దుర్మార్గమన్నారు. దాంతో ప్రస్తుతం కొనుగోలు చేసిన ప్రకారం చూస్తే సగం మంది రైతుల వద్ద మాత్రమే కొనుగోలు చేశారు. ఇంకా సగం మంది రైతుల పొగాకు ఇండ్ల వద్దనే పొగాకు చెక్కులు దర్శనమిస్తున్నాయని చెప్పారు. ఆ రైతులకు సీరియల్ పేర్లు రాక కొనుగోలు కేంద్రాలకు రాని దుస్థితి నెలకొంది. ఈ మేరకు కొనుగోలు చేసిన రైతాంగానికి ఎకరానికి రూ.50 వేల వరకు నష్టం తప్పడం లేదు. దాంతో అసలు కొనుగోలు నిలిపి వేస్తే మరింత నష్టపోతారన్నారు. పొగాకు అమ్ముడుపోక కూలీలకు కూడా డబ్బులు ఇవ్వలేని పరిస్థితిలో రైతాంగం కొట్టుమిట్టాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి ఇచ్చిన హామీ ప్రకారం రైతుల వద్ద ఉన్న బర్లీ పొగాకును చివరి ఆకువరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వర్జీనియా పొగాకు లోగ్రేడ్‌ను రూ.20 వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలన్నారు. లేకపోతే పొగాకు రైతాంగాన్ని ఏకం చేసి ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు టీ శ్రీకాంత్, జి బసవపున్నయ్య, రావెళ్ల వెంకట్రావు, నాగేశ్వరరావు, గద్దం ఏలియ్య, పాలపర్తి యోనా, హజరత్తయ్య, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.